సాక్షి చిత్తూరు
శుక్రవారం । 27 । అక్టోబర్ । 2023



పదిలో వందశాతం ఫలితాలే లక్ష్యం

టెన్త్‌లో వందశాతం ఫలితాలే లక్ష్యంగా పని చేయాలని డీఈఓ విజయేంద్రరావు సూచించారు. - 8లో



'లక్ష'ణంగా చదువు

జగనన్న సివిల్స్ ఇన్సెంటివ్ పథకంపై విద్యార్థులు, విద్యా వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - 8లో



ముగిసిన సహిత విద్యా ఇంటర్వ్యూలు

సహిత విద్య రిసోర్స్ పర్సన్స్ పోస్టుల భర్తీ రెండు రోజుల ఇంటర్వ్యూలు గురువారం ముగిశాయి. - 8లో

న్యూస్‌రీల్

కాణిపాకం.. ఆధ్యాత్మికత సౌరభం



మాజీ మంత్రి కొడాలి నానికి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో భక్తిభావం ఉట్టి పడుతోందని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని అన్నారు. గురువారం స్వామి వారి దర్శనార్థం కుటుంబ సమేతంగా ఆయన కాణిపాకం విచ్చేశారు. వారికి ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలను చైర్మన్, ఈఓ అందించారు. ఆలయం లోపల, పరిసరాలను వారు సందర్శించారు. ఈసందర్భంగా నాని మాట్లాడుతూ ఆలయంలో ఆధ్యాత్మికత ఉట్టి పడుతోందని తెలిపారు. ఆలయం కట్టడాలు సౌందర్యంగా ఉన్నాయని పేర్కొన్నారు. భక్తులకు దర్శన ఏర్పాట్లు కూడా బాగున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, చిత్తూరు సీఐ రవిశంకర్ రెడ్డి, కాణిపాకం ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పారదర్శక సేవలు

చిత్తూరు కార్పొరేషన్: ఉద్యోగుల్లో బాధ్యత పెంచి, సచివాలయాల్లో పారదర్శక సేవలు అందేలా ఎంపీడీఓలు, తహశీల్దార్లు, మండల స్థాయి అధికారులు తరచూ తనిఖీ చేయాలని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. తనిఖీల్లో సచివాలయ ఉద్యోగులు హాజరు, పనితీరు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కార అంశాలను పరిశీలించాలని తెలిపారు. కచ్చితంగా ప్రతి ఉద్యోగి కార్యాలయానికి వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలన్నారు. ఫిర్యాదులను పరిష్కారించే దిశగా సచివాలయాల ఉద్యోగులు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నగదు రహిత సేవలపై అవగాహన

చిత్తూరు కార్పొరేషన్: పంచాయతీల్లో ప్రారంభం కానున్న నగదు రహిత సేవలపై గురువారం డీపీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు బ్యాంకు అధికారులు అవగాహన కల్పించారు. అధికారులు మాట్లాడుతూ జిల్లాలోని 697 పంచాయతీల కోడ్‌లు, బ్యాంకు ఖాతాలను పీఓఎస్ మిషన్లకు అనుసంధానం చేశామన్నారు. 3వేలకు పైగా జనాభా ఉన్న 113 పంచాయతీలకు సంబంధించి పీఓఎస్ మిషన్లు జిల్లాకు చేరుకున్నాయని తెలిపారు. ఇందులో సాఫ్ట్‌వేర్, యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. ఇంటిపన్ను, భవనాల అనుమతులు, కొళాయి కనెక్షన్ ఇలా మొత్తం సేవలు నగదు రహితంగా జరుగుతాయన్నారు. ప్రజలకు ఇంటి పన్ను ఇచ్చాక ఏటీఎం, క్యాష్ పేమెంట్ యాప్‌ల ద్వారా నగదు వసూలు చేయాలని తెలిపారు. వీటిపై పంచాయతీల స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విధానంలో నగదు లావాదేవీల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంటుందన్నారు. ఎవరు పన్ను చెల్లించాలి, ఇంక ఎంత కట్టాలి అనే వివరాలు వేగంగా తెలుస్తుందన్నారు. 3వేల కంటే తక్కువ జనాభా ఉన్న పల్లెలో క్యూఆర్ కోడ్ ద్వారా వసూలు చేయాలని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది పురుషోత్తం, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.


నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి) : కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ నిత్యాన్నదానానికి గంగాధరనెల్లూరు మండలం నందనూరుకు చెందిన పూర్ణచంద్ర రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆయనకు ఆలయ అధికారులు స్వామి వారి దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాగి సాగు.. ఆదాయం రెట్టింపు



ప్రభుత్వం పంపిణీ చేసిన నాణ్యమైన విత్తనాలు



కుప్పం ప్రాంతంలో ఏపుగా పెరిగిన రాగిపంట

జిల్లా సమాచారం ఇలా

- రాగి సాధారణ సాగు: 2600 ఎకరాలు
- ప్రస్తుతం సాగు: 1760 ఎకరాలు
- రబీ సాగు లక్ష్యం: 15వేల ఎకరాలు
- ఉచితంగా అందజేసిన విత్తనాలు: 100 క్వింటాళ్ళు
- 50శాతం సబ్సిడీతో: 50 క్వింటాళ్ల వరకు

నీటి సౌకర్యం తక్కువగా ఉండి, పెట్టుబడులు పెట్టి సేద్యం చేయలేని రైతులకు రాగి పంట కల్పతరువుగా మారింది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందే అవకాశం ఉండడంతో జిల్లాలోని పడమటి మండలాల రైతులు ఈ రబీ సీజన్‌లో నీటి ఆధారిత పంటగా రాగి పంటను సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం విత్తనాలను ఉచితంగా, యాభైశాతం సబ్సిడీతో ఆర్‌బీకేల ద్వారా ఇప్పటికే పంపిణీ చేసింది. ఐక్యరాజ్య సమితి సైతం 2023 ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాగి పంట లక్ష్యాన్ని 15వేల ఎకరాలకు పెంచేలా వ్యవసాయ, డ్వామా, హార్టికల్చర్, డీఆర్‌డీఏ అధికారులు ప్రోత్సహిస్తున్నారు.

- పెట్టుబడి తక్కువ, ఆదాయమెక్కువ
- 15వేల ఎకరాల్లో సాగు లక్ష్యం
- ఎకరాకు రూ.వెయ్యి ప్రోత్సాహం
- నాణ్యమైన విత్తనాల పంపిణీ

పలమనేరు : పడమటి మండలాల్లో రబీ సీజన్‌లో రాగి సాగుపై రైతులు దృష్టి సారించారు. శాస్త్రీయంగా ఫింగర్ మిల్లెట్ అని పిలిచే ఈ పంట పొరుగునే ఉన్న కర్ణాటకలో భారీ విస్తీర్ణంలో సాగవుతోంది. జిల్లాలోని పలమనేరు, కుప్పం, పుంగనూరులో ప్రస్తుతం రాగిని సాగు చేస్తున్నారు. ఎకరా పొలంలో ఆరు తడైతే ఐదునుంచి ఆరు క్వింటాళ్లు, నీటి వసతి ఉంటే 8 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం క్వింటాల్ రాగి ధర రూ.6,400గా ఉంది. ఆ లెక్కన నీటి వసతితో పంట చేస్తే రూ.50వేల దాకా అర్జించవచ్చు. ఎకరాకు పంట పెట్టుబడి కేవలం రూ.5వేలు మాత్రమే. రూ.45వేల దాకా రైతుకు మిగిలినట్టే. మూడు నెలల్లో పంట చేతికొస్తుంది. జిల్లాలో చిరుధాన్యాల సాగును పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. గత జూన్‌లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్వామా, హార్టికల్చర్, డీఆర్‌డీఏ సంయుక్తంగా జిల్లా మహిళా సమాఖ్యతో సమావేశాన్ని నిర్వహించింది. రాగి పంటసాగుతో కలిగే లాభాలను వివరించి పంట సాగుకు పలు ప్రోత్సాహకాలనిచ్చింది. ఈ రబీలో జిల్లాలో రాగిసాగును 15వేల ఎకరాలకు పెంచేలా లక్ష్యం నిర్ణయించారు. ఇప్పటికే వీఎల్–352, వీఎల్ 376 రకం రాగి విత్తనాలను రైతుభరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీ, పూర్తి ఉచితంగా పంపిణీ చేశారు. మరోవైపు రాగి పండించే రైతులకు ఎకరాకు రూ.1000 ప్రోత్సాహంగా అందించనున్నారు. ఇందుకోసం డీఆర్‌డీఏ సైతం విస్తృతంగా కృషి చేస్తోంది.

రాగి పదార్థాలతో పోషకాలు

ఆహారంలో లోపించే మిథియోనైన్ అనే యాసిడ్ రాగిలో ఎక్కువగా ఉంటుంది. అధిక బరువు తగ్గడానికి, మధుమేహ నియంత్రణకు, ఎముకల పుష్టికి, స్థూలకాయ నివారణకు, రక్తహీనత మెరుగు, కండరాల బలోపేతానికి ఇదెంతగానో ఉపకరిస్తుంది. దీంతో పాటు ఆందోళనలు తగ్గించడమే కాకుండా త్వరగా వృద్ధాప్యం రాకుండా చేసే గుణం రాగికి ఉంది. అందుకే ప్రస్తుతం రాగి ముద్దతో పాటు రాగిదోసె, ఇడ్లీ, మురుకులు ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్నాయి.



కుప్పంలో రాగి సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

రైతులను ప్రోత్సహిస్తున్నాం



రాగి సాగును ప్రోత్సహించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలోని మహిళా సమాఖ్య ద్వారా గ్రూపు మహిళలు రాగి సాగు చేసేలా అవగాహన కల్పించాం. విత్తనాలను ఉచితంగా, సబ్సిడీతో పంపిణీ చేశాం. ఈ రబీలో 15వేల ఎకరాల్లో సాగు లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఆమేరకు చర్యలు తీసుకుంటున్నాం.

– మురళీకృష్ణ, జాయింట్ డైరెక్టర్, అగ్రికల్చర్, చిత్తూరు

గ్యారెంటీ ఆదాయం



రకరాల పంటలను సాగు చేసి భారీ పెట్టుబడులను పెట్టి నష్టాలు తెచ్చుకునే బదులు తక్కువ ఖర్చుతో గ్యారెంటీ లాభం వచ్చే రాగి ఇప్పుడు రైతులకు మేలుగా మారింది. చీడపీడల బాధ లేకుండా కూలీల ఖర్చులేకుండా సులభంగా పండే పంట ఇది. చిన్న, సన్నకారు రైతులకు సైతం చాలా సులువైన పంట.

– చందూల్ రెడ్డి, సేంద్రియ రైతు, కూర్మాయి(పలమనేరు)

ముఖ ఆధారిత హాజరు ప్రారంభం



టీటీడీ పరిపాలనా భవనంలో ముఖ ఆధారిత హాజరును ప్రారంభిస్తున్న ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: టీటీడీ ఉద్యోగుల ముఖ ఆధారిత హాజరు విధానాన్ని గురువారం టీటీడీ పరిపాలనా భవనంలో ఈవో ఏవీ. ధర్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీలో 8 వేలకుపైగా రెగ్యులర్ ఉద్యోగులు, 10 వేలకుపైగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. వీరందరికీ ముఖఆధారిత హాజరును అమలు చేస్తున్నట్టు వెల్లడించారు. తిరుమల, తిరుపతిలోని టీటీడీ కార్యాలయాలతో పాటు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఇతర సంస్థల్లో ముఖ ఆధారిత హాజరును అమలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, డెప్యూటీ ఈవో గోవిందరాజన్, ఐటీ జనరల్ మేనేజర్ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు అర్ధగిరి ఆలయం మూసివేత

తవణంపల్లె: చంద్రగ్రహణం సందర్భంగా శనివారం సాయంత్రం 5 నుంచి ఆదివారం ఉదయం 5 గంటల వరకు అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయాన్ని మూసివేయనున్నట్టు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పైమాఘం సురేంద్రరెడ్డి, ఈవో వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం 5 గంటల వరకు భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అనంతరం చంద్ర గ్రహణం కారణంగా ఆలయంలో అన్ని సేవలు రద్దు చేస్తున్నట్టు చెప్పారు. వచ్చే నెల 27వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు.

వాటర్‌షెడ్ పనులు భేష్

- లక్ష్యానికి అనుగుణంగా పనులు కల్పించారు
- రైతు దంపతులను సన్మానించిన కేంద్ర జలశక్తి బృందం
- జిల్లాలో పలు మండలాల్లో పర్యటన



చౌడేపల్లెలో రైతు వీరాస్వామి దంపతులను సన్మానిస్తున్న కేంద్ర జలశక్తి అభియాన్ బృందం, డ్వామా పీడీ

చౌడేపల్లె: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చిత్తూరు జిల్లాలోని రైతులు వాటర్ షెడ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని, చౌడేపల్లె మండలం నూనెముద్దనపల్లెకు చెందిన రైతు వీరాస్వామిని ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ సెంట్రల్ నోడల్ ఆఫీసర్ సచీంద్రకుమార్ పట్నాయక్ కొనియాడారు. గురువారం శాస్త్రవేత్త సోమేంద్ర సింగ్ కూడిన కమిటీ బృందం జిల్లా అధికారులతో కలసి చౌడేపల్లె మండలంలోని ఆమినిగుంట, గడ్డంవారిపల్లె, పరికిదొన పంచాయతీల పరిధిలో వాటర్ షెడ్ పథకం కింద అమృత్ సరోవర్‌లో భాగంగా తవ్విన నీటి ఊటకుంటలు, చెక్‌డ్యాం, చెక్ వాల్ పనులను పరిశీలించింది. రైతులకు అనుగుణంగా వాటర్ షెడ్ సిబ్బంది ఏర్పాటు చేసిన పనులు చాలా ఉపయోగంగా ఉన్నాయని తెలిపారు. ఈ పథకం కింద ఏర్పాటు చేసిన ఊటకుంటలో నిల్వ చేసిన నీటి ద్వారా వరి పంట, ఉపాధి హామీ నిధులతో మామిడి తోటల పెంపకం పనులు చేపట్టిన రైతు వీరాస్వామి, కస్తూరమ్మ దంపతులను ప్రశంసించడంతోపాటు కేంద్ర బృందం, డ్వామా పీడీ గంగాభవాని సన్మానించారు. వీరాస్వామిని మిగిలిన రైతులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈపర్యటనలో డ్వామా ఏపీడీలు ఉమాదేవి, నీలిమ, శ్రీనివాసులు, ఎంపీడీఓ సుధాకర్, పీఓలు ధనుంజయవర్మ, శ్రీనివాస్‌యాదవ్, జేఈలు శ్రీనివాసులు, ధనుంజయుడు, వాటర్‌షెడ్ చైర్మన్ చలపతి నాయుడు, ఉపాధి, వాటర్ షెడ్ సిబ్బంది పాల్గొన్నారు.



బంగారుపాళెం: అమృత్ సరోవర్ చెరువును పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

భూగర్భ జలాల వృద్ధి

బంగారుపాళెం: ఉపాధి హామీ పథకం కింద తవ్విన అమృత్ సరోవర్ చెరువు, ఫీడర్‌చానల్‌తో భూగర్భ జలాలు వృద్ధి చెందాయని రైతులు తెలిపారు. మండలంలోని పాలేరు గ్రామంలో కేంద్ర జలశక్తి అభియాన్ కమిటీ పర్యటించింది. అమృత్ సరోవర్ చెరువు, ఫీడర్‌చానల్‌ను కమిటీ నోడల్ అధికారి సచీంద్రకుమార్ పట్నాయక్, శాస్త్రవేత్త సోమేంద్ర సింగ్ పరిశీలించారు. రైతులకు ఉపయోగంగా ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చెక్‌డ్యామ్‌లు నిర్మాణం చేపట్టక ముందు వ్యవసాయ బోరు బావుల్లో నీరులేక అవస్థలు పడ్డామని, చెక్‌డ్యామ్‌లు, కుంటలు నిర్మించడం వల్ల భూగర్భ జలాలు అభివృద్ధి చెంది వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకుంటున్నామని రైతులు వివరించారు. అలాగే సోమల, సదుం మండలాల్లో కమిటీ పర్యటించింది.

పోలీస్ ఆయుధాల ప్రదర్శన




విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న, ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు ఏఆర్ పోలీసు కార్యాలయంలో గురువారం ఆయుధాల ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను ప్రారంభించిన ఎస్పీ రిశాంత్‌రెడ్డి మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసు వినియోగించే ఆయుధాలు, పరికరాలు, సాధనాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రదర్శనను తిలకించేందుకు వచ్చే విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మీ, శ్రీనివాసమూర్తి, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి, విష్ణు రఘువీర్, బాబు ప్రసాద్, శ్రావణ్‌కుమార్, మురళీధర్, సీఐలు విశ్వనాథ్‌రెడ్డి, మద్దయ్యాచ్చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో ఇలా...

ప్రదర్శనలో పలు విభాగాలకు సంబంధించిన పరికరాలు, ఆయుధాలను ఉంచారు. డ్వాగ్ స్క్వాడ్, బాంబు డిటెక్షన్, స్క్వాడ్ విభాగం, కమ్యూనికేషన్ విభాగం, ఫింగర్ ప్రింట్స్, క్లూస్‌టీం, ట్రాఫిక్ విభాగం, దిశాయాప్, పోలీస్ ఆఫీసర్స్ కేడర్స్, ఎర్రచందనం, ఎస్ఈబీ క్రైమ్ ప్రత్యేక స్టాల్ వంటి వాటిని తిలకించవచ్చు. గురువారం పలు పాఠశాలల నుంచి సందర్శనకు విచ్చేసిన విద్యార్థులు ఆయుధాల పనితీరును తెలుసుకునేందుకు ఆసక్తి చూపారు. వారికి పూర్తి స్థాయిలో పోలీసు అధికారులు అవగాహన కల్పించారు.

భవన నిర్మాణాల్లో లక్ష్యాలు సాధించాలి




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

- ఇళ్లు నిర్మించుకోకపోతే రద్దు
- సమీక్షలో కలెక్టర్ షణ్మోహన్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రభుత్వ భవన నిర్మాణాల పురోగతికి అత్యంత ప్రాధాన్యతం ఇవ్వాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఎంపీడీవో, గృహ నిర్మాణ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో పనులపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 496 గ్రామ సచివాలయాలు, 440 రైతుభరోసా, 296 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఆ భవనాల పనుల పూర్తికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు పనులు వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. గృహ నిర్మాణాల్లో పురోగతి తప్పనిసరిగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పథకానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇళ్ల మంజూరై నిర్మించుకోకపోతే రద్దు చేయాలని ఆదేశించారు. ప్రాధాన్యత భవనాల పనులకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయించాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులదేనని తెలిపారు. స్టేజీల వారీగా పురోగతి లేని ఇళ్లను రద్దు చేసి ఆ జాబితాలను సచివాలయాల్లో ప్రదర్శించాలన్నారు. అర్హత ఉన్న వారికి తప్పనిసరిగా అడ్వాన్స్ ఇచ్చి గృహ నిర్మాణాలు వేగవంతం చేయించాలని తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ పద్మనాభం, ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు బ్రహ్మోత్సవాల బహుమానం



అర్చకులకు బ్రహ్మోత్సవ బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి) : కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించిన అర్చకులు, వేద పండితులు, సిబ్బందికి పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. వారికి బ్రహ్మోత్సవ బియ్యం, బహుమానం అందజేశారు. వారు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో స్వామివారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని తెలిపారు. వారికి ఇబ్బంది కలుగకుండా స్వామివారి దర్శనం కల్పిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఐరాల మండల నాయకులు గణేష్ ప్రసాద్ రెడ్డి, ఉభయదారులు రవిరెడ్డి, రవీంద్ర రెడ్డి, గోపీనాథ్, ఎంపీటీసీ భర్త సుధీర్, ఆలయ ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

6న అప్రెంటీస్‌లకు ఇంటర్వ్యూలు

చిత్తూరు రూరల్: ఆర్టీసీలో అప్రెంటీస్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న చిత్తూరు జిల్లా అభ్యర్థులకు నవంబరు 6వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ శిక్షణ కేంద్రంలో ఆరోజు ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను తీసుకురావాలని పేర్కొన్నారు.

ముగిసిన సహిత విద్య రిసోర్స్‌పర్సన్ల ఇంటర్వ్యూలు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న సహిత విద్య రిసోర్స్ పర్సన్ల పోస్టుల భర్తీకి చిత్తూరులో నిర్వహించిన రెండ్రోజుల ఇంటర్వ్యూలు గురువారం ముగిశాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న భవిత కేంద్రాల్లో వినికిడి, దృష్టి లోపం ఉన్న పిల్లల బోధనకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు స్థానిక బాలాజీకాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. 18 పోస్టులకు 55 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా, 52 మంది హాజరయ్యారు. చిత్తూరు డీఈఓ విజయేంద్రరావు, అన్నమయ్య జిల్లా డీఈఓ శ్రీరామ్ పురుషోత్తం, సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశారు. వారి విద్యార్హత సర్టిఫికెట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష శాఖ సహిత విద్య కో–ఆర్డినేటర్ ప్రభాకర్‌వర్మ, పాఠ్యాంశ నిపుణులు రాజేష్, విష్ణుప్రియ, సిబ్బంది లావణ్య పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఫలితాలే లక్ష్యం

పెనుమూరు(కార్వేటినగరం) : పదో తరగతిలో వందశాతం ఫలితాలే లక్ష్యంగా ఇప్పటి నుంచే ఉపాధ్యాయులు పని చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు సూచించారు. గురువారం పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా పాఠ్యంశాలను బోధించాలని సూచించారు. ఆంగ్ల మాధ్యమాన్ని సులభ రీతిలో అర్థమయ్యేలా బోధించి, ప్రతి ఒక్కరూ ఆంగ్లంలో మాట్లాడే విధంగా చూడాలన్నారు. అనంతరం పాఠశాలలో నాడు–నేడు పనుల పరిశీలించి, వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండల విద్యాశాఖ అధికారులు రంగనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలే కాకుండా హామీ ఇవ్వని పథకాలను కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. సివిల్స్ పరీక్షల్లో అర్హత సాధించిన బలహీన వర్గాల అభ్యర్థులకు శిక్షణ కోసం జగనన్న సివిల్స్ ఇన్సెంటీవ్(ప్రోత్సాహకం) పేరుతో పథకం అమల్లోకి తెచ్చారు. ఏటా సివిల్స్ ప్రిలిమినరీ క్వాలిఫై అయిన వారికి రూ.లక్ష, మెయిన్స్ క్వాలిఫై అయిన వారికి అదనంగా మరో రూ.50 వేల అందజేయనున్నారు. ఈ పథకం విధి విధానాలు ఖరారు చేస్తూ జీవో విడుదల చేశారు.



లక్షణంగా చదువు

- సివిల్స్ ప్రిపరేషన్ కోసం జగనన్న ప్రోత్సాహక పథకం
- పేద విద్యార్థులను సివిల్స్ వైపు ప్రోత్సహించేందుకు ఆర్థిక అండ
- విద్యా వ్యవస్థ కొత్తపుంతలు తొక్కుతోందంటున్న విద్యావంతులు
- నవంబర్ 4వరకు దరఖాస్తుకు గడువు
- జగనన్నకు రుణపడి ఉంటామంటున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: ఎందరో పేద విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలని కలలు కంటారు. ఆర్థిక ఇబ్బందులతో కలలు కలలుగానే నిలిచిపోయి ఏదో కోల్పోయామని మదన పడుతుంటారు. ఈనేపథ్యంలో సామాజికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏటా నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలను అధిక సంఖ్యలో రాసేలా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సివిల్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు జగనన్న సివిల్ సర్వీసెస్ ఇన్సెంటీవ్ పథకాన్ని ప్రవేశపెడుతూ విధివిధానలతో జీవో ఎంఎస్ 58ని ప్రభుత్వం విడుదల చేసింది. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు ఈ పథకం వర్తిస్తుంది. ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన వారు మెయిన్స్ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు రూ.లక్ష ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తుంది. మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అవసరమైన కోచింగ్, ఇతర అవసరాల కోసం రూ.50 వేల ఆర్థిక సాయం అందిస్తుంది.

అర్హతలు ఇవి

- అభ్యర్థులు తాము సివిల్స్ ప్రిలిమ్స్ లేదా మెయిన్స్‌లో అర్హత సాధించినట్లు ప్రూఫ్ చూపించాల్సి ఉంటుంది.
- అభ్యర్థుల కుటుంబాల వార్షిక ఆదాయ పరిమితి రూ.8 లక్షలకు మించకూడదు.
- అభ్యర్థుల కుటుంబాలకు 10 ఎకరాల లోపు మాగాణి లేదా 25 ఎకరాల లోపు మెట్ట భూమి మాత్రమే ఉండాలి.
- కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉండకూడదు.

ఉచితం పేరుతో ముంచిన టీడీపీ ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సివిల్స్ సర్వీసెస్‌కు శిక్షణ పొందే అభ్యర్థుల కోసం ఉచిత కోచింగ్ పేరుతో తూతూ మంత్రంగా కొన్ని కోచింగ్ సెంటర్లను తెరచి అనుభవం లేని అధ్యాపకులతో అభ్యర్థులకు శిక్షణ ఇప్పించారు. ఉచిత కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందిన ఏ ఒక్క విద్యార్థి కనీసం ప్రిలిమినరీ పరీక్ష సైతం ఉత్తీర్ణత సాధించలేక పోయారు. అభ్యర్థులు తమకు నచ్చిన కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందవచ్చనే వెసులుబాటు ఇస్తూ ప్రైవేట్ కోచింగ్ సెంటర్లతో కుమ్మక్కై నిధులను స్వాహా చేసి విద్యార్థులను నట్టేట ముంచారు. 2018లో రాష్ట్రంలోని కొన్ని యూనివర్సిటీలలో విద్యార్థులకు ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ కోర్సుల పేరుతో సివిల్స్ కోచింగ్ ఇస్తామని విద్యార్థులను మభ్యపెట్టి ప్రైవేటు వ్యక్తులకు కోచింగ్ బాధ్యతలను అప్పజెప్పారు. ప్రభుత్వం నుంచి అందే స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పక్కా ప్రణాళికతో కాజేశారు. ఇటువంటి అక్రమాలకు ఫుల్‌స్టాప్ వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకాన్ని ప్రవేశపెట్టి ఆర్థికంగా వెనుకబడిన అభ్యర్థులకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించనుంది.

సివిల్స్ సాధిస్తామనే ధైర్యం కలుగుతోంది



నేను తిరుపతి గిండి ఐఏఎస్ స్టడీ సర్కిల్‌లో సివిల్స్‌కు కోచింగ్ తీసుకుంటున్నాను. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా పేదల కోసం ప్రవేశపెట్టి జగనన్న ప్రోత్సాహక పథకం చాలా మందిని సివిల్స్ వైపు దృష్టిపెట్టేలా చేసింది. ప్రిలిమ్స్ కొంత కష్టపడి ఉత్తీర్ణులైతే మెయిన్స్‌కు ఈ పథకంతో కొంత ఆసరా లభిస్తుంది. మంచి కోచింగ్ తీసుకునేందుకు ఆస్కారం ఉంటుంది.

– మణిదీప్, సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థి, తిరుపతి

మా లాంటి వారికి ఆసరా



సివిల్స్‌పై ఆసక్తి ఉన్న మాలాంటి విద్యార్థులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. ప్రిలిమ్స్ కొంత మేర ఉత్తీర్ణత సాధిస్తామనే ధైర్యం ఉంది. మెయిన్స్ కోసం ప్రభుత్వం అందించే ప్రోత్సాహకంతో మంచి కోచింగ్ తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–కృష్ణవేణి, సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థిని, తిరుపతి

దరఖాస్తు ఇలా..



2023లో నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకానికి వచ్చే నెల 4వ తేదీ లోపు ఏపీ జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఉన్నత లక్ష్యాన్ని ఎంపిక చేసుకున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– యూ.చెన్నయ్య, తిరుపతి జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారిత అధికారి

చాలా గొప్ప పథకం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేద విద్యార్థులు రుణపడి ఉంటారు. నాకు సివిల్స్ సర్వీసెస్ లాంటి పోటీ పరీక్షలకు అధ్యాపకునిగా 30ఏళ్ల అనుభవం ఉంది. జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకం చాలా గొప్పది. కోచింగ్ సెంటర్లకు లక్షలు కుమ్మరించలేని నిరుపేదలకు ఇది ఊరటనిచ్చే అంశం. ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన చాలామంది మెయిన్స్‌లో తప్పుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం సరైన కోచింగ్ లేకనే. ఆర్థిక సాయం చేసి ప్రోత్సహించడం శుభపరిణామం. ఎక్కువ మంది పేదలు సివిల్స్ వైపు మొగ్గు చూపుతారు.

– డాక్టర్ టి.సురేంద్రనాథ్‌రెడ్డి, ఎస్వీయూ వీసీ మెంబర్, సీకాం విద్యాసంస్థల చైర్మన్

పేద వర్గాలకు వరం



సివిల్స్ సర్వీసెస్ ఉద్యోగాలు సాధించాలని చాలామంది కలలు కంటారు. కొంత కష్టసాధ్యంతో కూడుకున్న పరీక్ష ఇది. ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణులైనా మెయిన్స్ కోసం కచ్చితంగా కోచింగ్ తీసుకోవాల్సిందే. అటువంటి పరిస్థితిలో పేదలకు కోచింగ్ తీసుకునే స్థోమత లేని అభ్యర్థులు మెయిన్స్‌లో చాలా మంది వెనుకబడుతుంటారు. అటువంటి వారికి జగనన్న ప్రోత్సాహక పథకం వరం లాంటిది. మెయిన్స్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఇంటర్వ్యూ కోసం శిక్షణ పొందేందుకు ఇతర ప్రాంతాలకు వెళుతుంటారు. అటువంటి వారికి ఈ పథకం ఆసరా.

– డాక్టర్ సురేష్ కుమార్ గిండి, ఆంత్రోపాలజీ, సీనియర్ సివిల్స్ పోటీ పరీక్షల అధ్యాపకుడు, తిరుపతి

అన్నదాత సుఖీభవ..

- రూ.38 లక్షలతో అన్నప్రసాద వితరణకు అవకాశం
- దాతలు స్వయంగా వడ్డించవచ్చు
- దాతల పేరు ప్రదర్శన



తిరుమల: తిరుమలలో ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణతో భక్తుల సేవలో దాతలు తరించే అవకాశాన్ని టీటీడీ కల్పించింది. కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవారి దర్శనార్థం దేశ విదేశాల నుంచి విచ్చేసే లక్షలాది మంది భక్తులకు రుచిగా, శుచిగా ఒక రోజు అన్నప్రసాదాలు అందించేందుకు టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టు ఒకరోజు విరాళ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఒక రోజు పూర్తిగా అన్నప్రసాద వితరణ కోసం రూ.38 లక్షలు విరాళం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ విరాళం మొత్తం ఇప్పటివరకు రూ.33 లక్షలు ఉండగా, పెరిగిన ధరల నేపథ్యంలో టీటీడీ రూ.38 లక్షలకు పెంచింది.

- ఉదయం అల్పాహారం కోసం రూ.8 లక్షలు, మధ్యాహ్న భోజనం కోసం రూ.15 లక్షలు, రాత్రి భోజనం కోసం రూ.15 లక్షలు అందించి దాతలు స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించవచ్చు.
- విరాళం అందించే దాత పేరును వెంగమాంబ అన్నప్రసాద భవనంలో బోర్డులో ప్రదర్శిస్తారు. అదేవిధంగా దాతలు తమ కోరిక మేరకు ఒక రోజు ఇక్కడ అన్నప్రసాదాలు వడ్డించే అవకాశాన్ని పొందొచ్చు.

అన్నప్రసాదాలు అందే ప్రాంతాలు

ప్రస్తుతం తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ –1, 2లోని కంపార్ట్‌మెంట్లు, బయటి క్యూలు, పీఏసీ–4(పాత అన్నప్రసాదం), పీఏసీ–2, తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం కాంప్లెక్స్‌లు, రుయా ఆస్పత్రి, స్విమ్స్, మెటర్నిటీ ఆస్పత్రి, బర్డ్, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి, తిరుచానూరులోని అన్నప్రసాద భవనంలో భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ జరుగుతోంది.

- తిరుమలలోని ఫుడ్ కౌంటర్లలో అన్నప్రసాదాలు అందిస్తున్నారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్–1,2లోని కంపార్ట్‌మెంట్లు, వృద్ధులు, దివ్యాంగులు వేచి ఉండే కాంప్లెక్స్, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన కాంప్లెక్స్, ప్రధాన కల్యాణకట్టలో టీ, కాఫీ, చంటిపిల్లలకు పాలు అందిస్తున్నారు.

పర్వదినాల్లో 3 లక్షల మందికి పైగా..

తిరుమలలో జనవరి 1న నూతన ఆంగ్ల సంవత్సరాది, వైకుంఠ ఏకాదశి, రథసప్తమి పర్వదినాలు, బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ రోజున 3లక్షల మందికి పైగా భక్తులకు టీటీడీ అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తోంది.

వెంగమాంబ అన్న ప్రసాద భవనంలో..

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు చట్నీతో కలిపి ఉప్మా, పొంగలి, సేమ్యా ఉప్మా అందిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 10.30 గంటల వరకు చక్కెర పొంగలి, చట్నీ, అన్నం, కూర, సాంబారు, రసం, మజ్జిగతో భక్తులకు వడ్డిస్తున్నారు. తిరుమలలో అన్నప్రసాదాల తయారీకి రోజుకు 14 నుంచి 16.5 టన్నుల బియ్యం, 6.5 నుంచి 7.5 టన్నుల కూరగాయలు వినియోగిస్తున్నారు.

సాఫ్ట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



జిల్లా జట్లకు ఎంపికైన సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు

పుత్తూరు రూరల్: పుత్తూరు ఎస్ఆర్ఎస్ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–19, అండర్–17 బాల బాలికల జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ జట్లను ఎంపిక చేశారు. పోటీలను ఈఎంఓ తిరుమలరాజు ప్రారంభించారు. నారాయణవనం హెచ్ఎం సులోచన ఆధ్వర్యంలో క్రీడా జట్ల ఎంపిక జరిగింది. ఎస్‌జీఎఫ్ నాయకులు సురేష్‌బాబు, బాబు, శరవణ, రమేష్, పీడీలు పాల్గొన్నారు.

అండర్–17 బాలికల జట్టు

జి.వర్షిణి, ఆర్.హేమలత (ఐరాల),ఎం.వసంతి(తిరుచానూరు), ఎస్.గాయత్రి(శంకరరాయపేట), బి.చరిష్మ, ఏ.త్రిష(ఈఆర్‌పేట), ఏ.కావేరి(డీఎంపురం), టి.అమృత(పరమాల), కేవీ.కల్పన, కె.డి.గిరిజ (నారాయణవనం), పి.బాలప్రవల్లిక (వరదయ్యపాళెం), డి.దేవర్షిణి (ఒత్తూరు), డి.ఇందు (వెదురుకుప్పం), కె.మన్విత (రాజగోపాలపురం), నందిని (నాగలాపురం), ఎం.చాందిని (గొల్లపల్లి)

బాలుర జట్టు

పి.తులసీనాథ్(ఐరాల), ఎం.పువికుమార్(టీఆర్‌పురం), పీఎస్.ప్రవీణ్, వై.భార్గవ్(నారాయణవనం), ఆర్.నాగచైతన్య(రంగంపేట), జి.జ్యోతీష్(ఐరాల), సి.భరత్, దినేష్(ఈఆర్‌పేంట), గుజన్‌రాజ్(నాగలాపురం), తరుణ్(వెదురుకుప్పం), డి.యశ్వంత్(డీఎంపురం), ఎం.విష్ణు(శంకరాయపేట), అజయ్(అప్పినాపల్లె), ఎస్.మహమ్మద్‌అలీ(పాకాల), బి.శేతన్‌సాయి(ఎస్‌బీఆర్‌పురం), ఎన్.శుభాష్(వెంగళత్తూరు)

అండర్–19 బాలికల జట్టు

బి.ఐశ్వర్య, ఎస్.స్పందన (పిచ్చాటూరు), ఎం.చైతుర్య, ఎం.ప్రవల్లిక(తిరుపతి), సి.రూప, కె.జాహ్నవి, రేణుక(ఐరాల), ఎన్.నవ్య, ఏ.ఉమా(వెదురుకుప్పం), డి.ఇష్మీనా(రేణిగుంట), జి.నందిని, పి.అక్షయ, బి.కీర్తన(ఈఆర్‌పేంట), జి.మధుమతి(గొల్లపల్లి), పి.కౌశల్య(పరమాల), కె.భావన(సత్యవేడు)

బాలుర జట్టు

కె.విష్ణు, ఎస్.చైతన్య, ప్రవీణ్‌సాయి, సంతోష్ (ఐరాల), జి.ఎస్.చైతన్య, ఎం.టి.నవీన్‌కుమార్ (పుత్తూరు), జె.తేజ (సిద్దంపల్లి), కె.ఉదయ్‌సాయి, చెంచునాగేంద్ర (నారాయణవనం), ఎం.సందీప్(రాగిమానుపేట), వరదరాజులు (వడమాలపేట), పి.కృష్ణచైతన్య (సత్యవేడు), బి.కేశవదాస్ (తిరుచానూరు), టి.భద్రేష్ (తిరుపతి), వి.కిరణ్‌కుమార్(గొల్లపల్లి), డి.శ్రీకాంత్ (ములకలచెరువు)

చంద్రబాబు కుప్పానికి చేసిందేమీ లేదు



మహిళలతో మాట్లాడుతున్న దుర్గాపద్మిని

కుప్పంరూరల్: కుప్పం ప్రజలు దశాబ్దాల పాటు చంద్రబాబునాయుడు ఆదరిస్తే ఆయన నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గాపద్మిని ఆరోపించారు. గురువారం కుప్పం మున్సిపల్ పరిధిలోని 1, 2 వార్డుల్లో 'జగన్ కోసం మనం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పెద్దన్నకొటాలు, యలాజ నూరు, చీగలపల్లి, చిన్నచీగలపల్లి, నారాయణపురం, అడవికొటాలు, మంగమ్మ ఊరు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 35 ఏళ్లుగా కుప్పం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న చంద్రబాబు ఎలాంటి అభివృద్ధికి కృషి చేయలేదని విమర్శించారు. అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే కుప్పం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యిందని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలకు అందరికీ అందుతున్నాయని తెలిపారు. కుప్పం నియోజక అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించి ఏ పనులకు నిధులు అడిగినా మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేలా ఆదరించాలని కోరారు. మున్సిపల్ చైర్మెన్ డాక్టర్ సుధీర్, కౌన్సిలర్లు మునిరాజు, సోమశేఖర్, ఎంఆర్ సురేష్, నాగరాజు, మోహన్‌రామ్, గణపతి, జగన్ పాల్గొన్నారు.

5 వేలు ఆర్థికసాయం

కూలి పనులు చేస్తూ గాయపడిన చీగలపల్లికి చెందిన నాగరాజుకు ఎమ్మెల్సీ సతీమణి దుర్గా పద్మిణి రూ.5 వేలను సాయంగా అందజేశారు. పనులు చేస్తూ రాయి చేతిపై పడడంతో గాయపడి నాగరాజు కూలీ పనులకు దూరమయ్యాడు. నాగరాజు స్థితిని గమనించిన ఆమె సాయం చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

పెద్దపంజాణి: కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని గురువారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. ముందుగా అందిన సమాచారం మేరకు మండలంలోని ముత్తుకూరు క్రాస్ వద్ద సిబ్బందితో ఎస్ఐ వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా స్కూటీలో వస్తున్న ఇద్దరిని ఆపి, వాహనం తనిఖీ చేయగా 432 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉన్నాయి. వీరు మండలంలోని సుద్దగుండ్లపల్లికి చెందిన నల్లప్ప కుమారుడు యువరాజు, నరసింహులు కుమారుడు నాగరాజుగా గుర్తించి, అరెస్టు చేశారు. బైక్‌తో పాటు మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

స్విమ్స్‌లో కాగిత రహిత డాక్యుమెంటేషన్

తిరుపతి తుడా: స్విమ్స్ ఆసుపత్రిలో నూతనంగా కాగిత రహిత డాక్యుమెంటేషన్ విధానానికి శ్రీకారం చుట్టారు. గురువారం కంప్యూటర్ ఆన్ వీల్స్(సీఓడబ్ల్యూ) పేరుతో ట్యాబ్‌ల సహాయంతో దీనిని ప్రారంభించారు. దీంతో హెల్త్ కేర్ సిస్టమ్‌లో రోగుల సమాచారాన్ని నమోదు చేయడంతో పాటు సులువుగా ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో పూర్తి వివరాలను నమోదు చేయడానికి వీలవడమే కాకుండా జాప్యాన్ని తగ్గించవచ్చు. దీంతో పాటు రోగుల కచ్చితమైన సమాచారాన్ని సరైన సమయానికి తప్పిదాలు లేకుండా పొందుపరచవచ్చు. త్వరితగతిన రోగుల ల్యాబ్ రిజల్ట్స్‌ను, రోగికి అందుతున్న, సూచించిన మెడిసిన్ వివరాలను తెలుసుకునేందుకు వీలుంటుంది. దీంతో రోగుల చికిత్స విషయంలో వైద్యులు త్వరితగతిన నిర్ణయం తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శ్రీరంగరాజపురం : మండలంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారి 50బసివిరెడ్డిపల్లె ఎస్టీ కాలనీ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు నగరి మండలం సత్రవాడ గాంధీనగర్ గ్రామం నుంచి రంగయ్య కుమారుడు దండపాణి ద్విచక్ర వాహనంలో వెదురుకుప్పం మండలం తిప్పినాయుడుపల్లెలోని అత్తింటికి వెళుతున్నాడు. 50బసివిరెడ్డిపల్లి ఎస్టీ కాలనీ వద్ద వాహనం అదుపు తప్పడంతో కింద పడ్డాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.